క్లుప్తంగా

నాని కుటుంబానికి ధర్మశ్రీ పరామర్శ


మృతుడు నానీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట : మండలంలోని అడ్డసరం గ్రామానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కూరాకుల నాని నాలుగు రోజుల క్రితం తగరపువలస నుంచి ఇంటికి వస్తుండగా సబ్బవరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అడ్డసరంలోని మృతుని ఇంటికి వెళ్లి, తండ్రి రాజ బాబును పరామర్శించారు. నాని చిత్రపటానికి నివాళులర్పించారు. ఆ కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటామని భరోసానిచ్చారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు విస్సారపు కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా శివకేశవుల కల్యాణోత్సవం


కల్యాణ వేడుకలో పాల్గొన్న భక్తులు

రావికమతం : ప్రసిద్ధి చెందిన కొత్తకోట శివకేశవ స్వామివార్ల ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామివారికి, రాజరాజేశ్వరి సమేత శ్రీరాజ లింగేశ్వర స్వామివారికి వార్షిక కల్యాణోత్సవాలు సోమవారం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంతోపాటు, పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా అమ్మవార్లను, స్వామివార్లను ఒకే వేదికపై అధిష్టింపజేసి పాంచరాత్ర, శైవాగమోక్తంగా కార్యక్రమాన్ని గుమ్ముడు దొరబాబు, పెనుగొండ నానాజి, పెనుగొండ నూకేశరావు దంపతుల చేతుల మీదుగా దేవదాయశాఖ నిర్వహించింది. ఈ నెల 3న సదోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధానార్చకులు భాస్కర్, సాయి తెలిపారు.

దేవాలయ భూముల కౌలుకు వేలం నేడు

నాతవరం : మండల కేంద్రంలోని శ్రీగంగాదేవి, శ్రీనూకాలమ్మ దేవస్థానం భూముల కౌలుకు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు యలమంచిలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవదాయశాఖకు చెందిన వ్యవసాయ పంట భూముల్లో సాగు కోసం కౌలుకిచ్చేందుకు నాతవరం రామాలయం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు వేలం పాట జరగనుందన్నారు. ఆలయ కమిటీ చైర్మన్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆధ్వర్యంలో జరిగే వేలం పాటకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు దేవదాయ శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు.

గ్రామ దేవతల పండగ నేడు

కె.కోటపాడు : మండలంలోని ఆర్లి గ్రామంలో పైడితల్లమ్మ అమ్మవారు, ఎ.భీమవరంలో మరిడిమాంబ అమ్మవారి పెద్ద పండగలను మంగళవారం ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆరేళ్ల తర్వాత ఆర్లి పైడితల్లమ్మ పండగ, ఐదేళ్ల తర్వాత ఎ.భీమవరం మరిడిమాంబ పండగ రావడంతో రెండు గ్రామాలూ విద్యుత్ దీపాలంకరణలతో పండగ శోభను సంతరించుకున్నాయి. సంప్రదాయం మేరకు పండగ రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు.

అకాల వర్షాలతో అపరాలకు మేలు

రోలుగుంట : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం చిరుజల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం 6 గంటలకే ఆకాశం మేఘావృతమై, వాతవరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. గత నెలలో రైతులు రోలుగుంట. వైబీ పట్నం, ఎం.కె.పట్నం, శరబవరం తదితర గ్రామాలల్లో బొబ్బరి, పెసర, మినుము, నువ్వు తదితర అపరాల పంటలు సాగు చేపట్టారు. ఎండలకు మొక్కలు వడిలిపోతున్న తరుణంలో సోమవారం కురిసిన అకాల వర్షానికి ఆ పంటలకు జీవం పోసినట్టయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

కె.కోటపాడు : ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. రోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ తరగతులుంటాయన్నారు. విద్యార్థులు ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సప్లిమెంటరీ పరీక్ష ఫీజును మే 3లోగా చెల్లించాలని తెలిపారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
✆ 9966329167, 9912440601

కార్మిక శక్తి వేడుక మేడే

- ఊరూరా అరుణ పతాక రెపరెపలు
- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా ఊరూరా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అరుణ పతాకం రెపరెపలాడింది. వామపక్ష పార్టీలు, వివిధ కార్మిక సంఘాల కార్యాలయాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ర్యాలీలు, మానవ హారాలు, సభలు, సమావేశాలు నిర్వహించి సంఘటిత కార్మిక శక్తిని ప్రదర్శించారు. కార్మికుల హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.

చోడవరం : కార్మికులంతా మే డే వేడుకలను సోమవారం ఎంతో సంబరంగా జరిపారు. ఈ వేడుకల్లో అన్ని కార్మిక సంఘాలు చేయిచేయి కలిపి తమ హక్కుల రక్షణకు ఎల్లప్పుడూ సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చాయి. ఎఐటీయూసీ, సీఐటీయూ, భవననిర్మాణ కార్మిక సంఘాలు, ఏఐఎఫ్‌టీయూ సంఘాలు వేర్వేరుగా మే డే వేడుకలు నిర్వహించాయి.

➡ ఏఐటీయూసీ కార్యాలయం పాతబస్టాండ్ వద్ద డివిజన్ కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు సీపీఐ జెండా ఎగురవేసి, నినాదాలు చేశారు. రిక్షాకార్మికులు, హమాలీలు, వ్యాన్, ఆటో యూనియన్ల డ్రైవర్లు, యజమానులు పెద్దసంఖ్యలో పాల్గొని పాత బస్టాండ్ నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి, మానవహారం నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు నేమాల నర్సింగరావు, కిల్లి లక్ష్మయ్య, కామిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

➡ భవననిర్మాణ కార్మికుల సంఘాలన్నీ మేళతాళాల మధ్య ఎంతో ఉల్లాసంగా వేడుకలు నిర్వహించాయి. చోడవరం డివిజన్ పరిధిలో ఉన్న సుమారు 60 సంఘాలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. వందలాదిగా తరలివచ్చిన కార్మికులంతా స్థానిక కాలేజీ జంక్షన్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ర్యాలీ చేశారు. కొత్తూరు, పాతబస్టాండ్ జంక్షన్ల వద్ద మానవహారం నిర్వహించారు. కార్మిక చట్టాలు కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నడం సరికాదని, కార్మికులు ఆగ్రహిస్తే ఏం జరుగుతుందో గత చరిత్రలు చెబుతున్న విషయాలను పాలకులు గుర్తించుకోవాలని భవననిర్మాణ కార్మికుల నాయకులు హెచ్చరించారు. చోడవరం లేబర్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ బాలగణపతి సోలాపూరమ్మ, సిద్ధివినాయక, చోడవరం డివిజన్ భవన నిర్మాణ కార్మికుల సంఘాల నాయకులు కొసర తాతారావు, కొసర సోమేశ్వరరావు, జనపరెడ్డి రామకృష్ణ, బత్తిన రమణ, గుమ్మాలపరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చోడవరం మెయిన్‌రోడ్డుపై భారీ ర్యాలీ నిర్వహిస్తున్న తాపీమేస్త్రీ, కార్మిక సంఘాలు

➡ వెంకన్నపాలెంలో ముఠా కార్మికులు మేడే వేడుకలు జరిపారు. ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు చోడవరం మెయిన్‌రోడ్డు మీదుగా భారీ ప్రదర్శన చేశారు. కొత్తూరు జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి, కార్మిక చట్టాలను అమలుచేసి కార్మికులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) ప్రతినిధి అయితరెడ్డి అప్పలనాయుడు, జనసాహితి జిల్లా కార్యదర్శి ఎస్.నూకాచారి, ఓపీడీఆర్ నాయకుడు శివాజీరావు, స్త్రీ విముక్తి సంఘటన నాయకురాలు ఓపీవీఎస్ లక్ష్మీకుమారి, నవయువ సమాఖ్య నాయకుడు కె.మోహన్, పీడీఎస్‌వో నాయకులు భాస్కరరావు, సురేష్, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కరించుకోగలమని సీపీఐ మండల కార్యదర్శి జి.జోగిరాజు అన్నారు. మేడే సందర్భంగా జి.చీడిపల్లిలో జెండా ఎగురవేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.


జి.చీడిపల్లిలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ మండల కార్యదర్శి జోగిరాజు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో మేడే సందర్భంగా జెండాను సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేమల కన్నబాబు, మండల కార్యదర్శి గరికిన రాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు కార్మిక లోకమంతా ఏకం కావాలని పిలుపునిచ్చారు. రూడి రామారావు,మల్లేష్, కె.చిరంజీవి పాల్గొన్నారు.

నాతవరం : మండల కేంద్రంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి, వేడుకలు నిర్వహించారు, కేంద్ర ప్రభుత్వం అవలింబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్మిక చట్టాలను, హక్కులను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీతారామ తాపీ మేస్త్రిల సేవా సంఘం, ముఠా కార్మిక సేవా సంఘం, భవన నిర్మాణ సేవా సంఘం నాయకులతో పాటు ఆటో యూనియన్ సేవా సంఘం సభ్యులు, సీఐటీయూ మండల శాఖ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


కె.కోటపాడులో జెండా ఆవిష్కరణలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు కాసుబాబు

గొలుగొండ : మండలంలోని ఏఎల్ పురం, కృష్ణదేవిపేట, గొలుగొండ, జోగుంపేట గ్రామాల్లో కార్మికుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఆటో, భవన నిర్మాణ కార్మికులు జెండాను ఎగరవేసారు. తమ హక్కుల సాధనకై ప్రతి ఒక్కరూ కలసికట్టుగా ఉండాలని సంఘం ప్రతినిధులు గంగాధర్, బుంగా గంగరాజు సూచించారు.

మాకవరపాలెం : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద మణికంఠ ఆటో యూనియన్ అధ్యక్షుడు కె.నారాయణరావు, సాయిబాబా గుడివద్ద రిక్షా కార్మికులు, జంగాపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి పాలపర్తి తాతబ్బాయి, సీఐటీయూ జిల్లా నేత అల్లు రాజు కార్మిక దినోత్సవం సందర్భంగా జెండాలను ఎగురవేశారు.

కె.కోటపాడు : మండల కేంద్రంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వేచలపు కాసుబాబు, మర్రివలసలో పొంతపల్లి రామారావు, రెడ్డి అప్పలనాయుడు, దాలివలసలో దమ్ము ముత్యాలనాయుడు, రామచంద్రపురంలో గొర్లె దేముడుబాబులు జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను జరిపారు.

కె.కోటపాడు : కింతాడ గ్రామానికి చెందిన శ్రీరావాలమ్మ తాపీ మేస్త్రీల సంఘం భవన నిర్మాణ కార్మికులకు అన్ని విధాలా అండగా ఉంటామని సంఘ గౌరవ అధ్యక్షుడు కన్నూరు సూర్యనారాయణ తెలిపారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కార్మిక సంఘం సభ్యులకు నిత్యావసర సరకులతో పాటు స్వీట్లు అందించారు.

కార్మికుల పోరాట స్ఫూర్తి అమోఘం

బుచ్చెయ్యపేట : హక్కుల సాధన కోసం కార్మిక సోదరులు ఐక్యమత్యం చేసే ఉద్యమ స్ఫూర్తి అమోఘమైనదని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం మేడే సందర్భంగా వడ్డాదిలో పలు కార్మిక సంఘాల నాయకులు జెండా వందనం చేశారు. వడ్డాది చెరకు కాటా నుంచి కరెంట్ ఆఫీసు మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మేడే సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కార్మిక సోదరులందరికి మేడే శుభాకాంక్షలు తెలిపారు. దేశ సంపద సృష్టి, ఆర్థిక పురోగతికై కార్మిక సోదరులు చెమట చిందించి, వారి జీవితాలను ధారబోస్తున్నారని కొనియాడారు. కార్మికులు తమ డిమాండ్లు, హక్కుల సాధన కోసం ఐకమత్యంతో చేసిన పోరాటాల వల్ల యాజమాన్యాలు దిగివచ్చిన సంఘటనల్ని వివరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత, తాపీ మేస్త్రి, కళాసీ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


వడ్డాదిలో కార్మికుల దినోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ


మేడే జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు గరికిన రాజు, వేమల కన్నబాబు


వర్షంలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు

విద్యార్థికి డిప్యూటీ సీఎం అభినందన


జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన పవన్‌ను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి : జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చూపిన దేవరాపల్లి మండలం బోయిలకింతాడకు చెందిన పడిడడికల పవన్‌కుమార్‌ను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు సోమవారం అభినందించారు. 90 శాతం పర్సంటైల్ సాధించిన పవన్‌ను అతని తల్లిదండ్రులు శంకర్, నాగమణి డిప్యూటీ సీఎం ఆశీర్వాదం కోసం తీసుకువచ్చారు. ముత్యాలనాయుడు శాలువా కప్పి, వృద్ధిలోకి రావాలని పవన్‌కు అభినందనలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


మహాలక్ష్మినాయుడుకు చెక్కు అందిస్తున్న ధర్మశ్రీ

రావికమతం : తీవ్ర అస్వస్థతకు గురై రెండు నెలల పాటు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొంది, ఇంటికి చేరిన మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడును ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఆయనకు అందించారు.

భక్తిభావం అలవరచుకోవాలి


సత్యనారాయణస్వామి కల్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, స్థానిక నాయకులు

రోలుగుంట : దైనందిన జీవితంలో భగవద్ధ్యానం, పూజలు ఉత్తమ కార్యాలని, ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని అలవరచుకోవాలని ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని కంచుగుమలలో సోమవారం జరిగిన సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎంపీటీసీ సభ్యుడు వడ్డాది సతీష్, మాజీ సర్పంచ్ పరవాడ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఉత్సవంలో భాగంగా మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ


మాడుగులలో కొత్తపింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వేమవరపు రామధర్మజ తదితరులు

మాడుగుల : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎంపీపీ వేమవరపు రామధర్మజ అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు ఆదేశాలతో ఏర్పాటు చేసిన కొత్త పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా తెల్లవారుజామునే అవ్వాతాతలకు పింఛన్లు అందించే పరిస్థితి దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. మండలంలో కొత్తగా 129 పింఛన్లు మంజూరు కాగా మాడుగుల పట్టణానికి చెందిన లబ్ధిదారులు 28 మంది ఉన్నారు.

➡ జాలంపల్లి పంచాయతీలో సర్పంచ్ దారా మల్లేశ్వరిచిన్ని ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ జరిగింది.

➡ జేడీపేట గ్రామంలో వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ పండగలా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వార్డు మెంబరు శీలామంతుల జ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకులు జవ్వాది వరహాలు, వేమన గణేష్, ఎడ్ల హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎ.కొత్తపల్లిలో నూతన ఫింఛన్లను అందిస్తున్న వైస్ ఎంపీపీ బుల్లిలక్ష్మి, సర్పంచ్ సత్య వెంకటరమణ

దేవరాపల్లి : ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చొరవతో ఎ.కొత్తపల్లి గ్రామానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు నూతన ఫించన్లు మంజూరైనట్టు వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి తెలిపారు. స్థానిక సచివాలయంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణతో కలిసి సోమవారం లబ్ధిదారులకు పింఛన్ అందించారు. ఫించన్లు మంజూరు చేసిన సీఎం జగన్‌కు, కృషి చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు లబ్ధిదారులు, వైస్ ఎంపీపీ, సర్పంచ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు, పంచాయితీ సెక్రటరీ టి.పవన్, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

మాకవరపాలెం : వేసవి శిక్షణతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం నుంచి లలితకళా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సెలవుల్లో విద్యార్థులు ఆటలకు పరిమితం కాకుండా, వివిధ అంశాల్లో శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, కరాటే, డ్యాన్స్, చెస్, నాటికల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు శిక్షణా కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుందర రావు, వైఎస్సార్‌సీపీ నేత గొంతిన హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

రావికమతం : నియోజక వర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. తట్టబంద పంచాయితీ శివారు కోవెలపాలెం, కసిరెడ్డిపాలెం గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షంలోనూ గొడుగులు పట్టి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి, స్థానిక సమస్యలు, పథకాల మంజూరుకు ఏమైనా ఆటంకాలున్నాయా? అంటూ ఆరా తీశారు. తమ గ్రామాలకు కొత్తకోట సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతోందని, అయితే తోటల మధ్య తరచూ వైర్లు తెగిపోయి, అంతరాయం కలుగుతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తట్టబంద సబ్‌స్టేషన్ నుంచి సరఫరా జరిగేలా చూడాలని కోరారు. అక్కడి నుంచే విద్యుత్ అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారానికి కృషి చేశారు. రామాలయం వద్ద కమ్యూనిటీ హాలు, డ్రైనేజీలు, గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజ లు కోరగా రూ.25లక్షలతో ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, ఎంపీటీసీ పిల్లా శేషుబాబు, ముఖ్య నాయకులు కోసూరి మంజు, పతివాడ ధనంజయ, ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.


విద్యుత్ సమస్య పరిష్కారానికి ట్రాన్స్‌కో అధికార్లతో మాట్లాడుతున్న ధర్మశ్రీ

సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

- ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

నాతవరం : ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు అవసరమైన సేవలను గ్రామ సచివాలయాలోనే అందించాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉన్నతాశయంతో ఏర్పాటు చేసిన సచివాలయాలు ప్రజలకు అన్ని విధాలుగా ఉపయోపడేలా పని చేయాలని కోరారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించటం, తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పన తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలను త్వరతగతిని పరిష్కారించేందుకు కృషి చేయాలన్నారు. మండల వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న సచివాలయ, హెల్త్ క్లినిక్, ఆర్బీకే నూతన భవన నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. అకాల వర్షాలతో ప్రజలు రోగాలబారిన పడకుండా తాగునీటి పథకాలు, బోర్లలో క్లోరినేషన్, డ్రైనేజీలు శుభ్రం చేయుట వంటి పనులు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పథకంలో లక్ష్యాన్ని అధిగమించేలా ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం, డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల, జేఈలు జోగారావు, వెంకటేశ్వరమ్మ, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో యాదగిరీశ్వరరావు

మేఘం మెరిసెను.. వర్షం కురిసెను

- వేకువ జాము నుంచి దంచికొట్టిన వాన
- అపరాలు, కూరగాయల పంటలకు మేలు

అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం వేకువజాము నుంచే జోరు వానతో ఊరూవాడా తడిసి ముద్దయ్యాయి. కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మురుగునీరు రోడ్లపైకి చేరి పలు చోట్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. గత కొన్ని రోజులుగా ఎండలతో అల్లాడుతున్న ప్రజలు.. తాజా వర్షానికి రోజంతా ఉపశమనం పొందారు.

బుచ్చెయ్యపేట : మండలంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్షం జోరుగా కురిసింది. తీవ్ర ఎండలు, వడగాల్పులతో అవస్థలు పడుతున్న ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. జోరు వాన, చల్లని గాలులతో మండల ప్రజలు సేద తీరారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 వరకు రెండున్నర గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. మండు వేసవిలో కురిసిన వర్షంతో రైతాంగానికి మేలు జరిగింది. ఎండిపోతున్న పలు రకాల పంటలకు, పశుగ్రాసంకు వర్షం ఎంతో ఉపయోగకరమని మండల రైతులు ఆనందిస్తున్నారు. కోత దశకు చేరిన కొద్ది మంది నువ్వు రైతులకు వర్షం వల్ల ఇబ్బందులు పడినా, అధిక శాతం రైతాంగానికి వర్షం మేలు చేసింది. ఖరీఫ్ వరి పొలం ఆకుమడులు దున్నుకోవడానికి, వేసవి దుక్కులకు మంచిదని రైతులు చెప్తున్నారు.


బుచ్చెయ్యపేట రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

మాకవరపాలెం: మండలంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. అత్యవసర పనులపై వెళ్లేవారు తప్పితే మిగిలిన వారు ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ వర్షం జీడి, మామిడి పంటకు నష్టం మిగల్చగా, కూరగాయల పంటలకు మేలు చేస్తాయని రైతులు చెబుతున్నారు.

రావికమతం : రావికమతంలో పలువురు వ్యాపారులు కాలువలను ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండటం, కాలువలు చెత్తాచెదారంతో పూర్తిగా పూడుకుపోవడంతో భారీ వర్షానికి కాలువల్లోని మురుగునీరంతా ప్రధాన రహదారిపై నుంచి పారింది. దీంతో రోడ్డంతా పూర్తిగా దుర్గంధం అలుముకుంది. స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కె.కోటపాడు : మండల గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి కూరగాయాల పంటలతో పాటు నాట్లు పూర్తి చేసిన చెరకు, సరుగుడు తోటలకు ప్రయోజనం కలగనున్నట్లు సాగు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కె.కోటపాడు, ఆనందపురం, చౌడువాడ గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.


దేవరాపల్లిలో కురుస్తున్న వర్షం

గొలుగొండ : మండలంలో తెల్లవారు జాము నుంచే ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం 12 గంటల వరకు కురిసిన వర్షం మెరక పంటలైన చెరకు, సరుగుడు, కూరగాయలు, పాడి పశువులకు ఉపయోగపడే పశుగ్రాసంకు ఎంతో మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా మోస్తరు వర్షం కురిసింది. దీంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. నిన్నటి వరకు ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు అకాల వర్షంతో ఉపశమనం పొందారు.

వీరవిల్లిలో తడిసిన వరి చేలు

మాడుగుల రూరల్ : మండలంలో వీరవిల్లి సమీపంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో సోమవారం కురిసిన అకాల వర్షాలకు సుమారు 20 ఎకరాలలో రబీ వరిచేలు నీట తడిచాయి. ఆరుగాలం కష్టపడి పండిన పంట చేతికి వచ్చే సమయంలో ఇలా జరిగిందంటూ బోగాది జోగారావు, అప్పారావుతో పాటు సుమారు 10 మంది రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

4 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

చీడికాడ : మండలంలోని దండిసురవరంలో 4 లీటర్ల సారాతో ఒక వ్యక్తి పట్టుబడినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు. సోమవారం ఉదయం గ్రామానికి చెందిన జి.రమేష్ సారా విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు వెల్లడించారు. రమేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నర్సీపట్నం డివిజన్:
నర్సీపట్నం : 9010234557
చోడవరం : 9010210265
మాడుగుల : 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com